

పార్టీ కోసం కష్టపడని వారికి టికెట్లు ఇవ్వొద్దు : జేసీ

పెనుకొండ : తెలుగుదేశం పార్టీ నాయకులపై జెసి ప్రభాకర్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం పెనుకొండ మండలంలో జరుగుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్రకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్‌ను శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మీడియాతో జెసి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు ఉన్నారని అయితే సరైన లీడర్లు ఎవరు లేరని అన్నారు. మూడున్నర సంవత్సరాలు కార్యకర్తలు కష్టపడ్డారని ఆ సమయంలో లీడర్లు ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో ఎవరు బయటకి రాలేదో వాళ్లకు టికెట్ ఇవ్వొద్దని లోకేష్ చెపుతున్నట్లు తెలిపారు. తనకు 72 సంవత్సరాలని, తనకు టికెట్ వద్దని అన్నారు. తాను పార్టీకోసం కష్టపడుతానన్నారు. తనలాంటి వారందరూ టికెట్ ఆశించకూడదన్నారు. అందరికీ తోక కట్ చేసి పారేయమని చంద్రబాబుకు చెబుతున్నానన్నారు. ధైర్యంగా ఉన్నవారి కి టికెట్ ఇవ్వాలని కోరారు. కేసులకు ఎవరూ భయపడద్దని తనపై 72 కేసులు అయ్యాయని అవి ఏమవుతాయని జెసి ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు.



మాట్లాడుతున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

బాగేపల్లిలో సిపిఎం విజయ బావుటా ఎగురవేస్తుంది

సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

గడిచిన రెండు ఎన్నికల్లో రెండవ స్థానంలో నిలుస్తూ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన సిపిఎం బాగేపల్లి నియోజకవర్గంలో ఈ సారి విజయ బావుటా ఎగరవేస్తుందని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవి రాఘవులు అన్నారు. బాగేపల్లిలో ఉన్న ప్రస్తుత ప్రత్యేక పరిస్థితులు సిపిఎంకి అనుకూలంగా ఉన్నాయని అన్నారు. బుధవారం బాగేపల్లి తాలూకా కేంద్రంలో సిపిఎం ముఖ్య నాయకుల సమావేశంలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, కేరళ మాజీ మంత్రి ఎంఎ బేబి, కర్నాటక రాష్ట్ర కార్యదర్శి బసవరాజు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం నుండి గూళూరు సర్కిల్ వరుకు ర్యాలీ నిర్వహించారు. కర్నాటక ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటన నేపధ్యంలో ఈ సమావేశం హుషారుగా సాగింది. ఇక్కడ పోటీలో ఉన్న ఇతర పార్టీ అభ్యర్థులు మధ్యం మాఫియా, రియలెస్టేట్ మాఫియా చేస్తుండటంతో మచ్చలేని సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ గెలుపును బాగేపల్లి ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఎదురొడ్డి గెలవలేని పార్టీలు సిపిఎం నాయకత్వాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర చేస్తున్నాయని మండిపడ్డాయి. సిపిఎం నాయకత్వాన్ని ఎవరూ విచ్ఛిన్నం చేయలేరని అన్నారు. ఒకరిద్దరు తాయిలాలకు కక్కుర్తిపడి వారి సొంత ప్రయోజనాల కోసం వైదొలొగినా..సిద్ధాంతం వంటబట్టని అలాంటి వ్యక్తుల వల్ల పార్టీకి ఎలాంటి నష్టం ఉండదని స్పష్టం చేశారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం ఎప్పుడూ ప్రజలలో ఉంటుందని ఆ పునాధులను ధ్వంసం చేసే దమ్ము ఏ రాజకీయ పార్టీకి, వ్యక్తులకు లేదని అన్నారు. అలాంటి స్వార్ధపూరిత వ్యక్తులకు ప్రజలే ఓటు అనే అయుధంతో బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ లను ఓడించడమే సిపిఎం లక్ష్యం అన్నారు. ఆ శక్తి బాగేపల్లి క్షేత్రంలో సిపిఎంకే ఉందన్నారు. కాంగ్రెస్, బిజెపిలను ఓడించడమే జెడిఎస్ లక్ష్యం అయితే తమతో కలిసి రావాలని అన్నారు. సిపిఎం నేత బేబీ మాట్లాడుతూ కేరళ మోడల్ పాలన కావాలని యావత్తు దేశం చూస్తోందన్నారు. అలాంటి పాలనను బాగేపల్లి ప్రజలు గతంలో చూశారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి బాగేపల్లి క్షేత్రంలో ఏమీ అభివృద్ధి చేయలేదని అన్నారు. గతంలో సిపిఎం ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి వల్లే నేడు పార్టీ గెలుపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప, నాయకులు, సావిత్రమ్మ, నాగరాజు, సోముశేఖర్ రెడ్డి యువజన సంఘం నాయకులు రఫీఉల్లా, హరీష్, సురేష్, ఆసిప్, విద్యార్థి సంఘం, మహిళా సంఘం, నాయకులు పాల్గొన్నారు.

నేడు రాప్తాడు నియోజకవర్గంలోకి యువగళం పాదయాత్ర

ఏర్పాట్ల పర్యవేక్షణలో మాజీ మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర గురువారం రాప్తాడు నియోజకవర్గంలోకి ప్రవేశించనుంది. పెనుకొండ నియోజకవర్గంలోని గుట్టూరు ప్రాంతం నుంచి చెన్నేకొత్తపల్లి మండలంలోకి లోకేష్ రానున్నారు. మధ్యాహ్నం నియోజకవర్గంలోకి ప్రవేశించిన తరువాత 3కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగనుంది. కోన క్రాస్ సమీపంలో రాత్రి బస చేసే ప్రాంతానికి చేరుకుంటారు. 31వ తేదీ ఉదయం 8 గంటలకు తిరిగి పాదయాత్ర ప్రారంభం కానుంది. 9గంటలకు చెన్నేకొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఉన్న సెంటర్ కి చేరుకొని అక్కడ దేవరకొండ రిజర్వాయర్‌కి భూములు ఇస్తున్న రైతులతో సమావేశం కానున్నారు. ఆ తర్వాత బీసీ కాలనీ సమీపంలో బీసీ నాయకులతో సమావేశమవుతారు. 10 : 20 గంటలకు పోలీస్ కేసులు ఎదుర్కొంటున్న వారితో లోకేష్ సమావేశం కానున్నారు. జాకీ పరిశ్రమ తరలించకూడదంటూ నిరసనలు తెలియజేసిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారితో లోకేష్ సమావేశం కానున్నారు. 11గంటలకు ఎన్ఎస్ గేట్ కి చేరుకుని.. 11.45 గంటలకు ఆటో డ్రైవర్లు, మెకానిక్‌లతో సమావేశం కానున్నారు. 12 : 45 గంటలకు నాగసముద్రం క్రాస్ సమీపంలో పేరూరు ప్రాజెక్టు కాలువ పనులకు భూములు ఇచ్చిన నిర్వాసితులతో లోకేష్ సమావేశమవుతారు. 1 : 30 నుంచి భోజన విరామం అనంతరం తిరిగి పాదయాత్ర ప్రారంభిస్తారు. 4 : 35 గంటలకు ఉప్పరవండ్ల కొట్టాల క్రాస్ సమీపంలోని సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులతో సమావేశం కానున్నారు. 5 గంటలకు చందమూరు క్రాస్ సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో లోకేష్ పాల్గొంటారు. సాయంత్రం 6:20 గంటలకి ప్యాదిండి సమీపంలోని రాత్రి బస చేసే ప్రాంతానికి చేరుకుంటారు. తిరిగి ఏప్రిల్ 1వ తేదీన అక్కడి నుంచి పాదయాత్ర ప్రారంభించి ప్యాదిండి గ్రామం, నామాల క్రాస్ మీదుగా ధర్మవరం నియోజకవర్గ పరిధిలోకి పాదయాత్ర ప్రవేశించనుంది. తొలిరోజు లోకేష్ కు భారీ స్వాగతం పలికేందుకు టీడీపీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లను మాజీ మంత్రి పరిటాల సునీత పర్యవేక్షించారు. స్థానిక నాయకులతో కలసి లోకేష్ యాత్రపై సమీక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో భోజన, తాగునీటి వసతి ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో రెండు రోజులు మాత్రమే పాదయాత్ర ఉన్న నేపథ్యంలో భారీగా తరలివచ్చే అవకాశం ఉందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు.

14 ఏళ్ల టిడిపి పాలనలో చేసింది శూన్యం : వైసిపి

ప్రజాశక్తి -పెనుకొండ

రాష్ట్రంలో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు న్యాయవాదులకు చేసిందేమీ లేదని వైఎస్ఆర్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది ఎం భాస్కర్ రెడ్డి విమర్శించారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యాయవాది భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ యువగళం పేరుతో పెనుకొండలో నారా లోకేష్ పాదయాత్ర ప్రవేశించిన నేపథ్యంలో న్యాయవాదులతో నారా లోకేష్ కలిశారన్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ దృష్టికి తమ సమస్యలను న్యాయవాదులు తీసుకెళ్లారన్నారు. అయితే నారా లోకేష్ న్యాయవాదుల సమస్యలు పట్టించుకోకుండాన్యాయవాదుల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకుంటే రాయలసీమ వాసిగా ఉన్న చంద్రబాబు నాయుడు కర్నూలులో హైకోర్టు ఏర్పాటును వ్యతిరేకిస్తూ అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. న్యాయవాదుల సంక్షేమం, అభివృద్ధి గురించి ఏం చేస్తాం అన్నది నారా లోకేష్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. లోకేష్ బాబు కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు సహకరిస్తారా.. లేక రాయలసీమ ద్రోహులుగా మిగిలిపోతారా చెప్పాలని ప్రశ్నించారు.

సామాజిక తనిఖీల్లో వెల్లడైన గోల్‌మాల్

పాత పనులకే కొత్త బిల్లులు

అగళి : ఉపాధి పనులకు సంబందించి నిర్వహించిన తనిఖీలో పలు అక్రమాలు బయటపడ్డాయి. పాతపనులకే కొత్త బిల్లులు తీసుకున్నట్లు బహిర్గతమైంది. దీంతో ప్రజలు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద బుధవారం ఉపాధి పనుల సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికను నిర్వహించారు. మండల వ్యాప్తంగా 2022 మార్చి నుండి 2023 మార్చి వరకు ఐదు కోట్ల రూపాయలతో ఉపాధి హామీ పనులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో ఒక్కో పంచాయతీలో మస్టర్ లేకుండానే బిల్లులు కూలీలు లేకుండానే వేరే పేరు పెట్టి బిల్లులు తెచ్చుకున్నట్లు వెల్లడైందన్నారు. రోడ్డు పక్కన అవిన్యూ ప్లాంటేషన్ కింద నాటిన మొక్కలు పూర్తిగా ఎండిపోయాయనివాటి బిల్లులు మాత్రం మంజూరు చేశారని వాటికి మాస్టర్లు లేకుండానే బిల్లు చెల్లించారని వివరించారు. ఇది తెలిసిన ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం..!

పదోతరగతి వార్షిక పరీక్షల్లో కార్పొరేట్, ప్రయివేటు పాఠశాలలకు దీటుగా వంద శాతం ఫలితాలను సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు అనంత సంకల్పం కార్యక్రమాన్ని చేపట్టారు. దీని కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ముందుకు సాగుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించి, తక్కువ మార్కులు సాధిస్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. రాత్రి వేళల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారు చదువుతున్నారో లేదో పరిశీలిస్తున్నారు. అర్థం కాని పాఠ్యంశాలను ఇంట్లోనే వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో వంద శాతం ఫలితాలు సాధించడానికి తీసుకున్న చర్యలపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం..

టెన్త్ ఫలితాల కోసం ప్రభుత్వ ఉపాధ్యాయుల కార్యాచరణ
అనంత సంకల్పంతో ముందుకు
విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
వంద శాతం ఫలితాల కోసం ప్రణాళిక



హిందూపురం కల్లూరు సుబ్బరావు ఓరియంటల్ స్కూల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

ఈ ఏడాది పదిలో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులు, ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐటిడిఎ పీవో ఆర్.గోపాలక్రిష్ణ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పుట్టపర్తి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల్లో 57 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. టీచర్లు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులు కూడా తమ ప్రతిభకు పదును పెట్టి రాత్రింబవళ్లు కష్టపడి చదువుతున్నారు. సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 435 పాఠశాలల్లో 25,881 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నారు. కదిరి ప్రాంతంలో గత ఏడాది జరిగిన సంఘటనల దృష్ట్యా 5 పరీక్ష కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఆయా కేంద్రాల్లో ప్రత్యేక నిఘా, సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పది పరీక్షల నిర్వహణపై ఇప్పటికే కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. విద్య, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య, ఆరోగ్య శాఖల సమన్వయంతో ఎలాంటి అవంతరాలూ లేకుండా పరీక్షలు పూర్తి చేయాలని నిర్ణయించారు. హిందూపురం పట్టణంలోని అజీజియా పాఠశాల హెచ్ఎం పాండు రంగనాయకులు సొంతంగా మోడల్ పేపర్స్ సిద్ధం చేసి, వాటిని డిజిటల్ విధానంలో విద్యార్థులకు వివరిస్తున్నారు.

యాక్షన్ ప్లాన్ అమలు..

ఐటిడిఎ కార్యాలయం విడుదల చేసిన యాక్షన్ ప్లాన్ ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నామని, దీంతో మంచి ఫలితాలు సాధిస్తున్నామని హిందూపురం పట్టణంలోని అజీజియా పాఠశాల హెచ్ఎం, సబ్జెక్ట్ టీచర్లు చెబుతున్నారు. ఈ పాఠశాలలో 140 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షకు హాజరుకానున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి టీచర్లు ప్రత్యేక తరగతులతో పాటు, స్టడీ అవర్స్, రోజు ఉదయం, సాయంత్రం పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులను దగ్గరుండి చదివిస్తున్నారు. వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. డిజిటల్ విధానంలో తరగతులు, మోటివేషన్ క్లాసులు నిర్వహించామన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను మెరుగుపరుస్తూ మంచి మార్కులు వచ్చేలా సన్నద్ధం చేస్తున్నారు.

వంద శాతం ఫలితాలకు చర్యలు..

సమ్మెటివ్, ఫార్మెటివ్ పరీక్షల ఫలితాలు ఆధారంగా వెనుకబడిన విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. పది పరీక్షల భయాన్ని పోగొట్టి వారిలో మానసిక స్థైర్యం నింపేలా సూచనలు ఇస్తున్నారు. నిపుణులు తయారుచేసిన మాదిరి ప్రశ్న పత్రాలతో సాధన చేయిస్తున్నారు. రోజూ ఉదయం ఒక గంట, రాత్రి రెండు గంటలు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఆయా సబ్జెక్టులకు అసైన్‌మెంట్‌లు ఇవ్వడం, రాయించడం చేస్తున్నారు. డైలీ టెస్ట్‌లను ఏరోజు కారోజు మూల్యాంకనం చేసి విద్యార్థుల ప్రగతిని తెలియజేస్తున్నారు. 57 రోజులు ప్రత్యేక ప్రణాళిక విషయంలో విద్యార్థులు గైర్హాజరు కాకుండా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేస్తున్నారు.

ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ..



పాఠశాలలో ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ద తీసుకుంటున్నాం. పదవ తరగతి విద్యార్థులను గ్రూపులుగా విభజించాం. మాదిరి ప్రశ్న పత్రాలను సిద్ధం చేసి వాటిపై తగిన శిక్షణ ఇచ్చాం. ప్రతి గ్రూపుకు 10 ప్రశ్నలు ఇచ్చి వాటిని చదివిన అనంతరం టెస్టులు పెట్టి వేరే గ్రూపు విద్యార్థులతో మూల్యాంకనం చేయిస్తున్నాం. దీంతో పోటీ తత్వం పెరిగి విద్యార్థులు బాగా చదివారు. తమ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఫలితాలతో పాటు, రాష్ట్ర స్థాయిలో మంచి మార్కులు సాధిస్తారన్న నమ్మకం ఉంది.

- అజీజియా హెచ్ఎం పాండురంగనాయకులు

ఇంటికెళ్లి సందేహాలు నివృత్తి చేశాం



విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి ఎ, బి, సి, డి గ్రూపులుగా విభజించాం. వారి స్థాయిని బట్టి ప్రత్యేక తరగతులు నిర్వహించాం. రాత్రి వేళల్లో విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి సందేహాలను నివృత్తి చేశాం. ఎటువంటి ఒత్తిడి లేకుండా ఆత్మస్థైర్యం పెంపొందేలా ప్రత్యేక కార్యాచరణ ద్వారా తర్ఫీదు ఇచ్చాం. చాలా మంది విద్యార్థులు మ్యాథ్స్ అంటే భయపడుతారు. దీని కోసం చాలా సులువుగా మాదిరి ప్రశ్న పత్రాలను సిద్ధం చేసి వారికి అర్థమయ్యే విధంగా వివరించాం.

- మ్యాథ్స్ టీచర్ సిద్ధరిగి శ్రీనివాసులు



కురుబ, బోయ కులస్తుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న నారా లోకేష్

వైసిపి పతనం తథ్యం..

రాష్ట్రాన్ని గాలికొదిలేసిన జగన్
అక్రమ సంపాదనే ధ్యేయంగా ముందుకు
యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-పెనుకొండ

జగన్ పని అయిపోయిందని, వైసిపి ప్రభుత్వ పతనం తథ్యమన్నారు. రాష్ట్రాన్ని జగన్ మోహన్ రెడ్డి గాలికి వదిలేసి అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదనే ధ్యేయంగా ముందుకెళ్తున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. బుధవారం సోమందేపల్లి సమీపంలోని నలగొండ్రాయనపల్లి విడిది కేంద్రం నుంచి లోకేష్ పాదయాత్ర ప్రారంభమైంది. విడిది కేంద్రంలో బ్రాహ్మణ సామాజిక వర్గీయులతో ఆయన భేటి అయ్యారు. సోమందేపల్లి దళితవాడలో ఎస్సీ వర్గీయులతో అనంతరం మహిళలతో సమావేశమయ్యారు. స్థానిక ఎన్టీఆర్ కూడలిలో చేనేతలతో సమావేశం నిర్వహించారు. పెనుకొండ మండలం వెంకటాపురం తండాలో స్థానికులతో, పెనుకొండలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహం ఆర్చి వద్ద స్థానికులతో మాటామంతీ చేపట్టారు. పార్టీ నాయకులు కార్యకర్తలు మైనార్టీ సోదరులు, ప్రజలు పెద్ద ఎత్తున నారా లోకేష్‌కు స్వాగతం పలికారు. పలువురు సమస్యలతో కూడిన వినతిపత్రాలను లోకేష్‌కు అందజేశారు. అనంతరం ఎన్‌గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్‌లో వ్యాపారులతో సమావేశం జరిగింది. కురుబ సామాజిక వర్గీయులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ.. కరోనా కంటే డేంజరస్ వైరస్ జగన్ అని, ఈ వైరస్‌కు వ్యాక్సిన్ చంద్రబాబు నాయుడే అని పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు రాష్ట్రానికి రావడం లేదన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని తెలిపారు. రాష్ట్రాన్ని జగన్ మోహన్‌రెడ్డి అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలే కాకుండా నిత్యావసర వస్తువుల ధరలనూ పెంచేసిందని అన్నారు. ఎనిమిది సార్లు కరెంటు ఛార్జీలు పెంచిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. వారు ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాల వైపు చూసే పరిస్థితి ఉందని అన్నారు. ఆంధ్రను గంజాయి కేంద్రంగా మార్చారని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి విచ్చలవిడిగా అమ్ముతూ వైసిపి నాయకులు సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. ఇసుకను దోచేస్తూ రోజుకు రూ.కోట్లు అర్జిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో చిరు వ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ నిధులు అందజేస్తామని చెప్పారు. సమాజంలో వ్యాపారులు కూడా భాగ్యస్వాములని, వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, టిఎన్‌టియుసి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల విషయంలో బిసిలకు అన్యాయం

సిఎం జగన్ బీసీలకు తీరని అన్యాయం చేశారని లోకేష్ అన్నారు. రిజర్వేషన్ల విషయంలో వారికి తీరని అన్యాయం జరిగిందన్నారు. బుధవారం పెనుకొండలో కురుబ, బోయ కులస్తుల ఆత్మీయ సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ.. టిడిపి హయాంలోనే బిసిలకు న్యాయం జరిగిందన్నారు. బిసిలను చట్టసభలకు పంపించిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. వారిని మంత్రులను చేసిన ఘనత కూడా టిడిపిదే అన్నారు. టిడిపిలో కష్టపడేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. పేద ప్రజలను సిఎం జగన్ వెంటాడి వెంటాడి పీడిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి రైతుల మెడకు ఉరితాడు వేస్తున్నాడన్నారు. నాడు చంద్రబాబు వాల్మీకుల రిజర్వేషన్‌పై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని గుర్తు చేశారు. ఆ తీర్మానానికి టిడిపి కట్టుబడి ఉందన్నారు. ఎస్టీ సోదరులకు ఇబ్బందులు లేకుండా వాల్మీకులకు రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పారు. కురుబలకు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులను కేటాయించిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. జగన్ కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందరూ ఐక్యంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, మాజీ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పూల నాగరాజు, మాజీ అహుడా ఛైర్మన్ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కురుబ కృష్ణమూర్తి, కురుబ, వాల్మీకి సాధికార కమిటీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కురుబ, వాల్మీకి కులస్తులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి తో పాటు, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఒ కొండయ్య పాల్గొన్నారు. అట్రాసిటీ కేసులపై అప్రమత్తత అవసరమన్నారు. నూతన జిల్లా కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని సేకరించాలన్నారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో శ్మశాన వాటికకు అవసరమైన భూమిని గుర్తించాలన్నారు. మండల పరిధిలోని ఒక గ్రామంలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ, జిల్లా ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరగతిన పరిష్కరించాలని అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.. తిప్పేస్వామి మాట్లాడుతూ అంబేద్కర్ భవనం జిల్లా కేంద్రంలో నిర్మించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మడకశిర నియోజకవర్గం లో చాలా గ్రామాల్లో ఎస్సీలకు శ్మశాన వాటికలు లేవన్నారు. వాటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, అమరాపురం మండల కేంద్రంలో ఇంటి స్థలాలకు అనువైన ప్రాంతంలో ఇవ్వాలని, ఇప్పుడు కేటాయించిన స్థలంలో వర్షం నీటి నిల్వలు ఉంటున్నాయని చెప్పారు. పలువురు సభ్యులు ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి శివరంగ ప్రసాద్, ఆర్డీవోలు భాగ్య రేఖ, తిప్పే నాయక్, రాఘవేంద్ర, డీఎస్పీలు యశ్వంత్, భవ్య కిషోర్, ఉమామహేశ్వర్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్యతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే ప్రధాన లక్ష్యం

కదిరి టౌన్ : కదిరి పట్టణాభివృద్ధే తమముందున్న అజెండా అని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా స్పష్టం చేశారు. బుధవారం కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు.తొలుత అజెండలోని అంశాలను అధికారులు ప్రవేశపెట్టారు. అజెండాలోకదిరి పట్టణ మాస్టర్ ప్లాన్ కు సంబందించి కౌన్సిల్ ఆమోదం తెలపలేదు. కౌన్సిలర్ కళ్యాణ్ మాట్లాడుతూ పట్టణంలో మున్సిపల్ అనుమతులు పొందకుండా ఎన్జీవో కాలనీ, టైటానిక్ ఫంక్షన్ హాల్, మదనపల్లి రోడ్డు, ఇలా పల్లుచోట్ల యదేచ్ఛగా అక్రమ లేఅవుట్లు వేస్తు క్రయ విక్రయాలు జరుపుతున్నారని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అక్రమ లేఅవుట్లు వేయకుండా మున్సిపల్ అధికారులు టౌన్ ప్లానింగ్ విభాగం తక్షణం చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. ఇందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి,గంగాదేవి,కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బబు ,అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఛైర్ పర్సన్ కు వినతి : మెప్మాలో పనిచేస్తున్న శ్రీనివాస్ రెడ్డి మహిళా సంఘాల సభ్యులను మానసికంగా వేధింపులకు గురి చేస్తూ అలాగే తనకు నచ్చిన వారిని ఆర్పీలు రిసోర్స్ పర్సన్ లు గా నియమిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయనపై చర్యలు తీసుకోవాలని 2వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఆధ్వర్యంలో ఛైర్ పర్సన్ కు వినతిపత్రం అందజేశారు. టిడిపి చెందిన కౌన్సిలర్ ఆల్ఫా ముస్తఫా మాట్లాడుతూ మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టేలా కమిషనర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తన ఆరోపణలు నిరూపణ కాకపోతే తన పదవికి రాజీనామా చేస్తానని సవాలు విసిరారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

మడకశిర రూరల్ : మండలం పరిధిలోని ఆమిదాలగొంది గ్రామ పంచాయతీ ఎగువ రామగిరి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ మాజీ డీలర్ హనుమంతారాయప్ప కొన్ని నెలలుగా క్యాన్సర్ వ్యాధి తో బాధపడుతూ వైద్యం చేయించుకొని ఇంటిలో విశ్రాంతి తీసుకొంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఈరన్న బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. తనవంతుగా రూ. 15వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీ ఆదినారాయణ, తాలూకా రైతు అధ్యక్షులు రాజ్ గోపాల్, టిడి. పల్లి మంజునాథ్, చంద్రశేఖర్ రెడ్డి, ఈశ్వరప్ప, గోపాల్ రెడ్డి, రామకృష్ణప్ప, చిరంజీవి, నరసింహ మూర్తి, రమేష్, మల్లేశప్ప, తదితరులు పాల్గొన్నారు.

వక్కలిగల సభను విజయవంతం చేయండి

మడకశిర : నారా లోకేష్ చేపడుతున్న యువగళం యాత్రలో భాగంగా గురువారం వక్కలిగ సామాజిక వర్గంతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తున్నారని ఆ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర వక్కలిగ సాధికారిక కన్వీనర్ పాండురంగప్ప, పార్లమెంట్ రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్ర నరసింహ, మాజీ ఎంపీపీ అశ్వర్థ రామప్ప ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా ఉంటున్న వక్కలిగా సామాజిక వర్గాన్ని భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించే విధంగా తీసుకొనే భవిషత్ కార్యాచరణ లో భాగంగా టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ తో ముఖాముఖి కార్యక్రమం పెనుకొండలో నిర్వహించనున్నారన్నారు. ఈ నేపథ్యంలో సంఘటితంగా వక్కలిగలు తరలిరావాలని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హిందూపురం : ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్‌టిసి బస్టాండ్, రైతుల సౌకర్యార్థం పట్టుగూళ్ల మార్కెట్‌లో శ్రీ యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో చెలివేంద్రాలను ప్రారంభించినట్లు హిందూపురం సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ రవిశంకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఈ రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యరకమంలో పీడీ పార్థసారథి, ఆదర్శ కుమార్, శంకర్, పట్టుగూళ్ల మార్కెట్ అధికారి లక్ష్మి రెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్, సేవా సమితికి చెందిన నాగరాజు, జగదీష్, రాజ్యలక్ష్మి మోహన్, వెంకటేష్, వెంకటరామిరెడ్డి, సునీల్, గోవిందరాజులు, భాస్కర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖమంత్రితో వీడియో కాన్ఫరెన్స్

పుట్టపర్తి రూరల్ : త్వరలో జరగబోయే 10 వ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అధ్వర్యంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సమావేశం లో బాగంగా జిల్లా లో 10 వ తరగతి పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకుంటున్న భద్రత చర్యలు గురించి ఎస్పీ తెలియజేశారు. జిల్లాలో మొత్తం 25,800 విద్యార్థులు ఈ సంవత్సరం 10 వ తరగతి పరీక్షలకు హాజరవుతున్నారని జిల్లా వ్యాప్తంగా 122 ఎగ్జామ్ సెంటర్లను ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, ఎస్‌బి డిఎస్‌పి ఉమా మహేశ్వర రెడ్డి, ఎఆర్ డిఎస్‌పి విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం మెడలు వంచుదాం : సిపిఎం


పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

పరిగి : ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మెడలు వంచుదామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ పేర్కొన్నారు. ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీకి సంబంధించిన గోడపత్రికలను మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, రాము, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టే చలో ఢిల్లీకి విజయవంతం చేయాలని కోరుతూ బత్తలపల్లి లోని నాలుగు రోడ్ల కూడలిలో జీపు జాతాను బుధవారం నిర్వహించారు. ఈ జీపు జాతా ధర్మవరం నుంచి,తాడిమర్రి, బత్తలపల్లి మీదుగా కొనసాగింది. నాలుగు రోడ్ల కూడలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు పోలా రామాంజనేయులు మాట్లాడుతూ చేనేత కార్మికులను ఆదుకోవాలన్నారు. రైతు సంఘం జంగాలపల్లి పెద్దన్న రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్. బాషా, ఆదినారాయణ, మారుతి, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప విమర్శించారు. ఏప్రిల్ 5న కార్మిక, కర్షక ఢిల్లీ పోరాట ప్రదర్శనకు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు చలో ఢిల్లీకి సంబందించిన కరపత్రాలను సిఐటియు ఆధ్వర్యంలో ప్రజలకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు జగదీష్, నాయకులు రామకృష్ణ, జబివుల్లా, మల్లికార్జున, చంద్ర, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

ఇసుక రీచ్‌ను రద్దు చేయండి

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంగా జయ మంగలి నది పరివాహక ప్రాంతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను వెంటనే రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పరిగి మండలంలోని పలు పార్టీ నాయకులు బుధవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుక తవ్వకాలు చేపడితే పరిగి మండలం మరోమారు కరువు మండలంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, రైతు సంఘాల నాయకులతో పాటు సిపిఎం నాగరాజు, వైసిపి ప్రభాకర్, శివశంకర్, గోవిందప్ప, మంజునాథ్ రెడ్డి, బిజెపి బద్రీనాథ్‌తో పాటు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్‌ఆర్ ఆసరా'లో రోడ్డు సెగ

ప్రజాశక్తి రొద్దం

స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో బుధవారం నిర్వహించిన వైఎస్‌ఆర్ ఆసరా లబ్ధిదారుల సమావేశంలో ఎమ్మెల్యేకు మహిళల నుంచి రోడ్డు సెగ తగిలింది. సమావేశంలో మండలంలోని చిన్నకోడిపల్లి గ్రామానికి చెందిన మహిళలు కూడా హాజరయ్యారు. దీంతో సమావేశం ముగియగానే ఆ గ్రామ మహిళలు అధిక సంఖ్యలో ఎమ్మెల్యే శంకర్నారాయణ వద్దకు వెళ్లి తమ సమస్యను వివరించారు. రొద్దం మండల కేంద్రం నుంచి చిన్న కోడిపల్లి వరకు రోడ్డు వేయాలని ప్రస్తుతానికి పెన్నా నదిలో ఇసుక ఎక్కువగా ఉండడంతో ఈ వేసవికాలంలో నడుచుకుంటూ వెళ్లడానికి కూడా అవకాశం లేకుండా ఉందని వాపోయారు. గత టిడిపి ప్రభుత్వంలో కూడా ఇలాగే మాటలతో కాలయాపన చేశారని ఈ ప్రభుత్వంలోనైనా మోక్షం ఏర్పడుతుందనుకుంటే పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమసయ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మంగమ్మ, ఎంపీపీ చంద్రశేఖర్, రాష్ట్ర స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి నారాయణరెడ్డి సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను నిలదీస్తున్న మహిళలు

నేరాలు ఘోరాలు

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

కదిరి టౌన్ : వరకట్నం వేధింపులతో కదిరి పట్టణంలో వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటనకు సంబందించి పోలీసులు, మృతురాలి తండ్రి తెలిపిన వివరాలు... నల్లమాడ మండలం దొన్నికోటకు చెందిన వెంకటప్ప నాయుడు కుమార్తె వనజను తనకల్లు మండలం బానకాడపల్లికి చెందిన అంజనప్పకు నాలుగు నెలల క్రితం ఇచ్చి వివాహం చేశారు. అంజనప్ప వనజ దంపతులు కదిరి పట్టణంలోని వాణి వీధిలో నివాసం ఉంటున్నారు. అంజనప్ప హంద్రీనీవా పంపు హౌస్ వద్ద ఎలక్ట్రిషన్ గా పనిచేస్తున్నారు. అంజనప్ప అదనపు వరకట్నం కోసం తరచూ వనిజను వేధిస్తుండేవాడు. ఆ వేధింపులు తాళలేక తన కూతురు ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తండ్రి వెంకటప్ప నాయుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు చెప్పారు.

బస్సు ఢీకొని వృద్ధుడు మృతి

హిందూపురం : పట్టణంలోని సూగురు గేట్ వద్ద బస్సు ఢీ కొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పట్టణంలోని ఇందిరా నగర్‌కు చెందిన అంగముత్తు (75)రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తనకల్లు : మండలంలోని కొక్కంటి క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఉస్తినిపల్లికి చెందిన లోకనాథరెడ్డి ద్విచక్ర వాహనంలో వస్తుండగా బొలెరో వాహనం ఢీకొని కాలు విరిగింది. అదే సమయంలో అటుగా నడిచి వెళ్తున్న మోహన అనే వ్యక్తికి కూడా గాయాలు అయ్యాయి.

జీన్స్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

లేపాక్షి : మండల పరిధిలోని హిందూపురం వెళ్లే ప్రధాన రహదారి లో ఏర్పాటు చేసిన సర్ దేనిమ్ జీన్స్ ఫ్యాంట్లు తయారు చేసే ఫ్యాక్టరీలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం లేక పోయినా కర్మాగారంలో ఉన్న మిషన్లు, ముడిసరుకులు దగ్ధమైంది. దీంతో కోట్ల రూపాయల్లో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. వారం లోనే రెండు సార్లు అగ్ని ప్రమాదం జరగడంతో సంస్థ కోలుకోలేని పరిస్థితిలో పడింది. కార్మికులు దిక్కు తోచని పరిస్థితి లో ఉన్నారు మంటల్ని అర్పడానికి హిందూపురం నుండి ఫైర్ ఇంజిన్ సిబ్బంది ప్రయత్నం చేస్తున్నప్పటికి మంటలు అదుపులోకి రావడం లేదు.

శ్రీరామనవమి సందర్భంగా సౌకర్యాలు కల్పిస్తాం

హిందూపురం : పట్టణంలో అత్యంత వైభవంగా జరుపుకుంటున్న శ్రీరామ నవమి పండుక వేడుకలకు సూగురు అంజినేయ స్వామి ఆలయం వద్ద భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు మున్సిపల్, దేవాదాయ శాఖ అధికారులకు సూచించినట్లు ఎమ్మెల్సీ ఇక్బాల్ తెలిపారు. ఈ ఈమేరకు ఆయన బుధవారం తన నివాసంలో మాట్లాడుతూ పట్టణంలో సూగురు వద్ద పురాతన అంజినేయ స్వామి ఆలయం వద్ద ఎంతో వైభవంగా నవమి వేడుకలు జరుపుకుంటారన్నారు. అక్కడ భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

హిందూపురం : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని బాలయేసు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్ రెడ్డి పేర్కొన్నారు. బాలయేసు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా బుధవారం కొటిపి పంచాయితీ ఇస్లాంపురం గ్రామంలో దేవాలయం, పాఠశాల ఆవరణంలో వాలంటీర్లు మొక్కలు నాటారు. అదే విధంగా గ్రామంలో ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేసి, ఇంటి ముందు మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌-ఎస్ పోగ్రాం అధికారి అశ్వర్థనారాయణ, పాఠశాల హెచ్‌ఎం ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస రెడ్డి, అధ్యాపకులు వేణు, హరీష్, రఘు, రమేష్, ఎన్‌ఎస్‌-ఎస్ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో 'పురం' విద్యార్థుల ప్రతిభ

హిందూపురం : అనంతపురం జిల్లా గుంతకల్లులో ఎఎస్ గోజు ఆర్‌వైయు కరాటే అసోసియేషన్ దినేష్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన 5వ ఇంటర్ స్కూల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో హిందూపురం విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ ఫైరోజ్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు ఆల్ ఇండియా చీఫ్ శిహన్, ఎం అల్తాఫ్ పాషా చేతుల మీదుగా మెడల్స్ అందుకున్నారని చెప్పారు. గుంతకల్లు పట్టణంలోని శ్రీ వివేకానంద పార్క్‌లో జరిగిన పోటీలకు కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచి వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. హిందూపురం నుంచి కరాటే ఇన్‌స్ట్రక్టర్ సెన్సేయి ఫైరోజ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వివిధ పాఠశాలలకు చెందిన 14 మంది విద్యార్థులు, సీనియర్ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వివిధ క్యాటగిరిలో పురం విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారన్నారు.

రాష్ట్రంలో వైద్యానికి పెద్దపీట : ఎమ్మెల్యే

పెనుకొండ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత వైద్యానికి పెద్దపీట వేశారని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గుట్టూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రములో గ్లోవిస్ ఇండియా అనంతపురం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారి సహకారంతో నిర్మించిన నూతన గదుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గదులను వారు ప్రారంభించారు. అనంతరం వారు ముఖ్యంగా పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నాడు నేడు కింద ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నారన్నారు. పెనుకొండకు మెడికల్ కళాశాలను తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోవిస్ ఇండియా అనంతపురం ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సిబ్బంది, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, పెనుకొండ మండల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

చేనేత పరిశ్రమను ఆదుకోండి

పాదయాత్రలో లోకేష్‌కు విన్నవించిన చేనేత కార్మికులు

ప్రజాశక్తి - సోమందేపల్లి

సంక్షోభంలో కూరుకుపోయిన చేనేత పరిశ్రమను ఆదుకోవాలని, లేని పక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని సోమందేపల్లి మండల చేనేతలు నారా లోకేష్ కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. యువగళం పాదయాత్రలో యువనేతను కలిసిన చేనేత, మరమగ్గాల కార్మికులు తమ సమస్యలు విన్నవించారు. సోమందేపల్లిలో 6వేల కుటుంబాలు చేనేత, మరమగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. చేనేత పని తప్ప మరే పని తెలియని చేనేత కార్మికులు కుటుంబాలను పోషించుకోలేక ఇతర ప్రాంతాలకు వలసవెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో సోమందేపల్లిలో 1350 మందికి పట్టు రాయితీ సబ్సిడీ అందేదని ప్రస్తుతం వివిధ కారణాలు చూపించి కేవలం 300 మందికి మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. నేతన్న నేస్తం పథకం ఇస్తున్నామన్న సాకుతో సుమారు వెయ్యిమందికి పైగా పట్టు రాయితీ కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరిగి, కొనుగోలు శక్తి పడిపోయి చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు.చేనేతలకు ఉచిత విద్యుత్, ఉచిత ఆరోగ్య బీమా పథకాలను కూడా పూర్తిగా రద్దుచేశారన్నారు.వైసిపి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచడంతో గతంలో రూ.500 నుంచి రూ.1000 వచ్చే కరెంట్ బిల్లు ప్రస్తుతం రూ.2వేల నుంచి రూ.3వేలవరకు వస్తోందని వాపోయారు. కుటుంబాన్ని పోషించలేక చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడితే, పరిహారం అందజేయకపోగా, కనీసం పరామర్శించే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించి అండగా నిలవాలని కోరారు. స్పందించిన లోకేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక మరమగ్గాలకు 500 యూనిట్లు, చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వినాయక్ నగర్ లో గల బాబ్జాన్ చేతి మగ్గాలను పరిశీలించి వారి సమస్యలను అడిగిన తెలుసుకొన్నారు. లోకేష్ పాదయాత్రలో బ్రాహ్మణ సంఘ నాయకులు కలిసి వారి సమస్యలను విన్నవించారు. అదే విధంగా జగ్జీవన్ రావు నగర్ దళితులు లోకేష్ ను కలిసి వారి సమస్యలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ, గుండుమల తిప్పేస్వామి అంబికా లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ సిద్ద లింగప్ప తదితరులు పాల్గొన్నారు.


నారా లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న జనం

వేలం పాటతో పంచాయతీలకు పెరిగిన ఆదాయం

కొత్తచెరువు : మేజర్ గ్రామపంచాయతీలో 2023 - 24 సంవత్సరానికి నిర్వహించిన మార్కెట్ వేలం ద్వారా పంచాయతీకి భారీగా ఆదాయం పెరిగింది. సర్పంచి రాధా అధ్యక్షతన వారపు సంత, దిన సంత, బస్టాండ్ సులభ కాంప్లెక్స్ తదితర వాటికి బుధవారం వేలం పాటలు నిర్వహించారు . గత ఏడాది కంటే ఈ ఏడాది పంచాయతీకి రూ. 8లక్షలు ఆదాయం పెరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిద్ధారెడ్డి, ఎస్ఐ లింగన్న, పంచాయతీ కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అమరా పురం : మండల కేంద్రంలో వారపుసంత, దినసరిసంత నిర్వహణకు బుధవారం వేలంపాటను నిర్వహించారు. వారపు సంత నిర్వహణకు రూ.1.55 లక్షలు, దినసరి సంతకు రూ. 75,500లకు తోకల మంజునాథ్ వేలం పాట పాడి దక్కించుకున్నారు. బస్టాండ్‌ను రూ. 1.40 లక్షలు, మటన్ మార్కెట్‌ను 18 వేల రూపాయలకు సొసైటీ మహమ్మద్ తగ్గించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఈరన్న తెలిపారు ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుధాకర్, వేలంపాటదారులు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు నాయక్, సర్పంచ్ కరుణాకర్ ఆధ్వర్యంలో గుడిబండ పశువుల సంత మార్కెట్ నిర్వహణకు వేలంపాటను బుధవారం నిర్వహించారు. ఈ వేలం పాట పలారం గ్రామానికి చెందిన పణి అనే వ్యక్తికి దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో వేలంపాటదారులు, అధికారులు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక పంచాయతీ కార్యాలయంలో లేపాక్షిలో పార్కింగ్ నిర్వహణ, మార్కెట్ నిర్వహణకు బుధవారం వేలం పాటను నిర్వహించారు. సర్పంచి ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాహనాల పార్కింగ్ ఫీజులు వసూలు సంబందించిన నరసింహమూర్తి రికార్డు స్థాయిలో రూ. 50.02లక్షలకు పాడి దక్కించుకున్నాడు. వారపు సంత మార్కెట్ రుసుము వసూలు చేసుకోవడానికి నయాజ్ అనే గుత్తేదారుడు రూ.2,85,500లకు దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ శివన్న, పంచాయతీ కార్యదర్శి నాగేంద్ర, విజయ్, ఎస్ఐ మునీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తతంగా ఉండాలి

మండలమీట్‌లో ఎంపిపి

బత్తలపల్లి : వేసవి కాలంలో తాగునీటి ఎద్దడితో పాటు అనారోగ్య సమస్యలు ఎక్కువగా వచ్చే వీలున్నందున కార్యదర్శులు, సర్పంచులు అప్రమత్తంగా వుండాలని ఎంపిపి గజ్జల వెంగళరెడ్డి, ఎంపిడిఒ సాయిమనోహర్ సూచించారు. అదేవిధంగా సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు నివేదించనున్నట్లు చెప్పారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాలలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి మాట్లాడుతూ గ్రామాలలో సత్యసాయి నీరు నెలలో 10 రోజుల పాటు రావడం లేదని, దీనిని దృష్టిలో పెట్టుకుని సర్పంచులు, కార్యదర్శులు చర్యలకు ఉపక్రమించాలన్నారు. పంచాయితీ బోర్లకు వున్న ప్యానల్‌బోర్డులు, కేబుల్ వైర్లు ఎత్తుకెళుతున్నారని ఆయా పంచాయతీల సర్పంచులు సభ దృష్టికి తీసుకురాగా ఎస్ఐ శ్రీహర్ష మాట్లాడుతూ గ్రామాలలో రెగ్యులర్‌గా డ్యూటీ పోలీసు వుంటారని, అయితే ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు డ్యూటీలు ఎక్కువ కావడంతో వారు కూడా గ్రామాలకు వెళ్లలేకుండా వున్నారని, త్వరలోనే సిబ్బందిని గ్రామాలకు పంపుతామని చెప్పారు. అనంతరం ఇతర శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కోటి సుధ, వైస్ ఎంపిపి సాకే పార్వతి, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న పరిటాల శ్రీరామ్


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గోనుగుంట విజయ్‌కుమార్


జెండా ఆవిష్కరణలో పుట్టపర్తి నాయకులు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ధర్మవరం టౌన్ : బడుగు బలహీన వర్గాల ఆరాధ్య దైవం నందమూరి తారకరామారావు అని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావదినోత్సవాన్ని పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా టీడీపీ కార్యాలయ ఆవరణంలో జెండా ఆవిష్కరించి అనంతరం ఎన్టీఆర్, పరిటాలరవీంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అదే విధంగా 10వ వార్డు టీడీపీ ఇన్చార్జ జమీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కమతంకాటమయ్య, నాయకులు ముత్యాలప్పనాయుడు, మాజీ జెడ్పీటీసీ మేకలరామాంజినేయులు, సీనియర్ నాయకులు ఫణికుమార్, బోయరవిచంద్ర, చింతలపల్లి మహేశ్ చౌదరి, పోతుకుంటలక్ష్మన్న, పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి : మండల కేంద్రంలో టీడీపీ 41 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కన్వనర్ యాతం పోతలయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి వాళులు అర్పించారు. అనంతరం టీడీపీ పార్టీ కార్యాలయం ముందు జెండా ఆవిష్కరించారు. ఈకార్యక్రమములో టీడీపీ నాయకులు సుధాకర్ చౌదరి,కాసుమూర్తి వెంకటేష్, బిల్లే భాస్కర్, సురేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలి వద్ద టిడిపి మండల నాయకులు తెలుగుదేశం పార్టీ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు, నాయకులు దండే రవి, దండే గంగశేఖర్, శ్రీనివాసులు, నరసింహులు, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు 41వ పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ విజయ్ కుమార్, శ్రీ రామ్ నాయక్, పైపల్లి సర్పంచి ప్రవీణ్ కుమార్, రంగప్ప మురారి తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నల్లమాడలో బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ మైలే శివశంకర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు టెంటు కేశవరెడ్డి, చౌట కుంట పల్లి, అబ్దుల్ సాబ్, ఈశ్వరయ్యలను శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొన్ని కోట కేశవరెడ్డి, డాక్టర్ బుట్టి నాగభూషణ నాయుడు, పుట్ల రవీంద్ర, బాలిరెడ్డి, ప్రకాష్ గౌడ్, పద్మనాభ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండల కేంద్రంలోని బుధవారం తెలుగుదేశం పార్టీ 41 ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ సి కొండయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు గంగరాజు, ప్రసాద్, ఆంజనేయ నాయక్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు

బుక్కపట్నం : తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని తేరు కూడలిలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం తెలుగుదేశం జెండా ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు మలిరెడ్డి, సాకే యశోద, లావణ్య గౌడ్, సుబ్బారెడ్డి, సయ్యద్ బాషా, వెంకట రాముడు, కరణం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ 41 వ ఆవిర్భావ దినోత్సవం తెలుగు తమ్ముళ్లు ఘనంగా జరుపుకున్నారు .ఈ సందర్భంగా పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం ముందు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేసి వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర బీసీ సాధికారిక కన్వీనర్ పాండురంగప్ప మాజీ ఎంపీపీలు ఆదినారాయణ, అశ్వత్థామప్ప, నాయకులుఉగ్రనరసింహ, ప్రకాష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : కొత్త చెరువులో టిడిపి నాయకులు కార్యకర్తలు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమానులవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు వెంకటరమణప్ప, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మడకశిర టిడిపి నాయకులు

మడకశిర : పట్టణంలోని బాలాజీ నగర్ లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు బుధవారం టిడిపి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, పట్టణ , గ్రామీణ అధ్యక్షులు మనోహర్, లక్ష్మీనారాయణ, జిల్లా మైనార్టీ నాయకుడు భక్తర్, పట్టణ కార్యదర్శి పుల్లయ్య చౌదరి, సన్నిరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఓబుల దేవర చెరువు : మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు ఒడిసి, కొండకమర్ల గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఒడిసి, కొండకమర్ల తెలుగుదేశం కార్యాలయాల ఎదుట జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర, పిట్ల సుధాకర్, షఫీ అహ్మద్, జాకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : మండల కేంద్రంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి మీనాక్షి రామిరెడ్డి, నాగమ్మ, ప్రకాష్, చంద్రశేఖర్ గౌడ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు

తలుపుల : మండల కేంద్రంలో బుధవారం అత్తర్ చాంద్ బాషా వర్గీయులు సీనియర్ నాయకులు ఎద్దుల రాముడు, కందికుంట వర్గీయులు ఉబ్బర రాజారెడ్డి, ఓబుల్ రెడ్డి ముబారక్, గంగరాజు, రఘునాథరెడ్డి వేర్వేరుగా టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో బుధవారం తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, సీనియర్ నాయకుడు మహబూబ్ బాషా, కుంచె నాగేంద్ర ప్రసాద్, బడా రాజారెడ్డి, మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, శంకర్ నాయుడు, సరోజమ్మ, దస్తగిరి, శ్రీధర్ రెడ్డి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ పార్టీ కన్వీనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అలాగే హనుమాన్ సర్కిల్ లో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, నాయకులు సుధాకర్, దెయ్యాల ఉమాపతి యాదవ్, బేకరీ నాయుడు, చెన్నకేశవ నాయుడు, ఐ టీడీపీ అధ్యక్షుడు జయప్రకాష్, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలో బుధవారం టిడిపి నాయకులు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు ఆర్ఎంఎస్ షఫివుల్లా, అమర్నాథ్, పట్టణ అద్యక్షులు రమేష్‌కుమార్ తదితరులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బేవనహళ్లి ఆనంద్, పరిమళ, సతీష్ కుమార్, రాఘవేంద్ర, తిమ్మయ్య, ప్రియ గంగాధర్, వెంకటరమణప్ప తదితరులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహం వద్ద హిందూపురం టిడిపి నాయకులు


ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నల్లమాడ, తనకల్లు మండలాల టిడిపి నాయకులు